క్లుప్తంగా

అండర్ పాస్‌లో వర్షపు నీరు తొలగింపు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఓల్డ్ టోల్‌గేట్ అండర్ పాస్‌లో వర్షం కురిసిన ప్రతిసారి భారీగా నీరు నిలబడడంతో శుక్రవారం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా పరిశీలించారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను పిలిపించి, అండర్‌పాస్‌లో నీళ్లు నిల్వ లేకుండా కచ్చ డ్రైన్ ఏర్పాటు చేసి, కొంత నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపించారు. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో పనులు చేపట్టి వర్షపు నీరు నిల్వలేకుండా చేస్తామని కమిషనర్ తెలిపారు.

అభయాంజనేయునికి పంచామృత స్నపన



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం అడ్డ రోడ్డు వద్దనున్న అభయాంజనేయ స్వామి ఆలయ ఆరో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పంచామృత అభిషేకం నిర్వహించారు. ఉదయాన్నే వైఖాసన ఆగమోక్తంగా వేద పండితుల ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, మండపారాధన నిర్వహించి పంచామృతాలు, పలు రకాల పండ్ల రసాలతో మన్యు, పురుష, శ్రీసూక్తాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగవల్లీ దళాలతో అష్టోత్తర పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు కె.మల్లికార్జునరావు, మురళీ కల్యాణి, కె.రామ కోటేశ్వరరావు, భాను సంధ్య పర్యవేక్షించారు.

ఇంటి పరిసరాల శుభ్రత అవసరం



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. దానిలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిసరాలు శుభ్రత గురించి అవగాహన కల్పించారు. తమ ఇంటిలోని నీటి తొట్లు ప్రతి నాలుగు రోజులకోసారి శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి బోండాలు వంటి వాటిలో వర్షపు నీరు నిలిచి ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే దోమలు లార్వాలు ఎక్కువ అవుతాయని, వాటి ద్వారా రోగాలు వచ్చే అవకాశం ఉందని వివరించారు. అనంతరం నీటి తొట్లు పరిశీలించి నీటిని ఒంపివేశారు.

నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో చోరీ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నవోదయ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఇద్దరు యువకులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నవోదయ కాలనీలో రవికిరణ్ అనే బిల్డర్ అపార్ట్ మెంట్ నిర్మాణ పనులు చేస్తున్నాడు. తెల్లవారుజామున గుర్తు తెలియని ఇద్దరు దొంగలు అపార్ట్ మెంట్‌లోని స్టోర్ రూమ్‌లోకి చొరబడి విద్యుత్ వైర్లు, ఇతర విలువైన వస్తువులను దొంగిలించారు. ఈ ఘటన సీసీ కెమెరాలో రికార్డయ్యింది. రవికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లి పోలీసులు తెలిపారు.

దుగ్గిరాలలో 'పల్లె పండుగ'



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం పల్లె పండగ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ షేక్ జబిన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కంఠంరాజు కొండూరులో రూ.20 లక్షలు, మంచికలపూడిలో రూ.15 లక్షలు, పెనుమూలిలో రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షురాలు కేశినేని అనిత, మండల పరిషత్ జనసేన పార్టీ అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు, విస్తరణాధికారి కేజీ నెహ్రూ, పీఆర్ డీఈఈ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మరో విద్యుత్ ఉద్యమం తప్పదు..!



నులకపేట సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నాయకుల నిరసన



మెల్లెంపూడి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా

విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన

తాడేపల్లిరూరల్: కొత్తగా అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై ట్రూ అప్ విద్యుత్ చార్జీల పేరుతో భారం మోపే ప్రయత్నాలను ఉపసంహరించుకోవలని కోరుతూ శుక్రవారం తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలోను పలు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

- మెల్లెంపూడి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం తాడేపల్లి రూరల్ కమిటీఆధ్వర్యంలో ట్రూ అప్ చార్జీల భారాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజలపై ఎటువంటి భారాలు వేయమని నమ్మబలికిందన్నారు. అధికారంలో వచ్చి నాలుగు నెలలు అవుతున్నా నిత్యావసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగి, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లామని చెప్పిన కూటమి నేతలు మాటలు తప్పుతున్నారని విమర్శించారు. ప్రజలపై రూ.8,114 కోట్ల ట్రూ అప్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 2022-23వలో విద్యుత్ వాడకానికి ట్రూ అప్ చార్జీల పేరుతో ఇప్పుడు ప్రజలపై భారాలు వేయడం సరికాదని అన్నారు. సీపీఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, నాగపోగు విజయరాజు, బొప్పన గోపాలరావు, కంచర్ల జేమ్స్, పల్లపాటి సుబ్బారావు, కురగంటి ప్రభాకర్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.
- నులకపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ట్రూ అప్ చార్జీలపై నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పార్టీ పట్టణ నాయకులు వేముల దుర్గారావు పాల్గొని, మాట్లాడారు. పెంచిన చార్జీలు తగ్గించకపోతే మరో విద్యుత్ ఉద్యమం ప్రారంభమవుతుందని హెచ్చరించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు దొంతిరెడ్డి శ్రీనివాస కుమారి, కొట్టే కరుణాకర్ రావు, కె.మేరీ, డి.విజయభాస్కర్ రెడ్డి, వై. బర్నబాస్, వి.శాస్త్రి, ఎల్. సత్యం, కె.ఆదినారాయణ పాల్గొన్నారు.
- దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు పనులు లేక, అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు నష్టాల్లో ఉన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జి. శ్రీనివాసరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, ఎం. నరసింహారావు, బి. అమ్మిరెడ్డి, రాజేష్, ఎస్.ఎస్. రత్నం పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి

తాడికొండ: ట్రూ అప్ పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తాడికొండ విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం చేపట్టిన తరువాత విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచి పేదలపై మోయలేని భారం వేశాయన్నారు. రైతు సంఘం నాయకులు ఇమ్మడి రామారావు, బాణావత్ భద్రయ్య, జోషి, షేక్ సుభానీ, కోటిరెడ్డి పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు విరమించుకోవాలి

కూటమి ప్రభుత్వం ట్రూఅప్ పేరుతో పెంచబోతున్న విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తుళ్ళూరు లైబ్రరీ సెంటర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం రాయపూడి విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి సీఆర్డీయే ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాజధాని డివిజన్ నాయకులు పేరం బాబురావు, కుంభా ఆంజనేయులు, షేక్ జానీ, వెంకట నారాయణ, కృష్ణారావు, వెంకటేశ్వరరావు తదిరతులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

మంగళగిరి: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో వేల కోట్లను విద్యుత్ వినియోగదారులపై మోపడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రజలకు హామిలిచ్చి ఓట్లు వేయించుకుని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అదనపు చార్జీలతో వినియోగదారులపై భారం మోపడం దుర్మార్గమన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జేవీ రాఘవులు, పి.బాలకృష్ణ, ఎస్ఎస్ చెంగయ్య, వై.కమలాకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: మండలంలోని పెదవడ్లపూడి, చిన వడ్లపూడి, కాజ, చినకాకాని, కాజ, వెంకటరెడ్డి పాలెం, ఆత్మకూరు, ఏపీ హౌసింగ్ కాలనీ, ఎన్ఆర్ఐ ఆసుపత్రి వెనక ఏరియాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ జి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ కండక్టర్ మార్పు, నూతన కండక్టర్ ఏర్పాటు పనుల నిమిత్తం తాడేపల్లి రూరల్ పరిధిలోని బ్రహ్మానందపురం, బొగ్గిళ్లు, వేమారెడ్డి కాలనీ, రాధారంగా నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మేడికొండూరు: ప్రతి ఖాతాదారుడు బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలనేది ఆర్బీఐ ముఖ్య ఉద్దేశ్యమని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిరిపురం బ్రాంచ్ మేనేజర్ అఖిల అన్నారు. మందపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (ఖాతాదారుల చైతన్యం, అవగాహన సదస్సు) పై ఒకరోజు వర్క్‌షాప్ జరిగింది. ముఖ్య అతిథిగా బ్రాంచ్ మేనేజర్ పాల్గొన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ ప్రసార మాధ్యమాల్లో మోసపూరిత ప్రకటనలను చూసి మోసపోకుండా బ్యాంకు నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా పీఓ లాలు నాయక్, సంస్థ రిసోర్స్ పర్సన్ కె. వేంకటేశ్వరరావు, డ్వాక్రా సీసీ మేరీ, రిసోర్స్ పర్సన్ షేక్ బాజీ, మందపాడు యానిమేటర్లు అశ్విని, వెలంగిణి, బ్యాంక్ ఖాతాదారులు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోండి



తెనాలిఅర్బన్: దోమల కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో బాలాజీరావుపేటలో వ్యాధులపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులు అన్నారు. నీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే పాత గృహోపకరణాల్లో ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందెబాలచంద్రమౌళి, సచివాలయ అడ్మిన్ శాంతకుమారి, పట్టణ సబ్‌యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, దీపాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ శాంతి

ఫిరంగిపురం: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్త హీనత దూరమవుతుందని వైద్యురాలు శాంతి అన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మండలంలోని గొల్లపాలెంలో శుక్రవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 156 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు రక్త హీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ శాంతి వివరించారు. ఆరోగ్య సిబ్బంది అందజేసే ఐరన్ మాత్రలతో పాటు ఆకు కూరలు,.పాలు, గుడ్లు, చిక్కీలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు బీపీ, షుగర్, యూరిన్ పరీక్షలు చేసి మందులు అందించారు. సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కేఎల్‌రావు కాలనీలో శుక్రవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ ప్రతి నెలా 3వ శుక్రవారం ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇంట్లో లభించే కరివేపాకు, మునగాకు వల్ల లాభాలు, వాటిని ఎండబెట్టి పొడి చేసుకుని ఆహార పదార్థాల్లో వినియోగించవచ్చని తెలిపారు. ఈ విషయాలను గర్భిణులకు వివరించామని, వాటి తయారీ విధానాన్ని చూపించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆర్‌వీఎన్ కుమారి, సుజాత, కమలకుమారి, ఆశ వర్కర్ భానుమతి పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కేఎల్‌యూలో వ్యక్తిత్వ వికాసంపై సదస్సు



సుమను సత్కరిస్తున్న డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ సోనీ

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం బాలికలకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సిలింగ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేఫ్ ఉపాధ్యక్షురాలు సుమ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేసి, జీవణ నైపుణ్యాలు, భావోద్వేగ మద్దతు, మానసిక ఆరోగ్య, విద్య, స్వీయ-అవగాహన, ఒత్తిడిని అధిగమించడం, వృత్తి పరమైన పురోగతి తదితర అంశాలపై ప్రసంగించారు. అనంతరం అట్లూరి సుమను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఫెడ్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. కృష్ణారెడ్డి, విద్యార్థి సంక్షేమ విభాగం అసోసియేట్ డీన్, ఉమెన్ డెవలప్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ రూతు రమ్య, కో-కన్వీనర్ డాక్టర్ కె. సోనీ, హెచ్ఓడీబీఈఎస్ డాక్టర్ పి.ఎస్.వి. బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ సమస్యలపై ఈ నెల 22న మంగళవారం విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి మోదుగుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా జొన్న శివశంకరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ కేరళ మంత్రి ఎంబీ రాజేష్, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజుకృష్ణన్, విద్యుత్ రంగ నిపుణులు డాక్టర్ కె. అశోక్ రావు, ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో బి. వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి కోటిరెడ్డి, బుల్లి కోటిరెడ్డి, లక్ష్మారెడ్డి, గుంపుల వెంకటేశ్వరరావు, డి. భాస్కర్ రెడ్డి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాడుతాం

తహసీల్దారు కార్యాలయం వద్ద వరద బాధితుల ధర్నా



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వరద బాధితులు

తాడేపల్లిరూరల్: ఇటీవల వచ్చిన వరద కారణంగా తాడేపల్లి సుందరయ్య నగర్, మహానాడు, కృష్ణవేణి నగర్ ప్రాంతాల వరద బాధితులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాశం రామారావు మాట్లాడుతూ వరదల్లో నష్టపోయిన వరద బాధితులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ నగరంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో వరద నీరు వస్తే వారికి రూ.25 వేలు నష్టపరిహారం అందించారన్నారు. తాడేపల్లిలోని వరద బాధితులు ఏం పాపం చేశారని నష్ట పరిహారానికి నోచుకోలేదని ప్రశ్నించారు. సీపీఎం తన శక్తి మేరకు ఐదు రోజుల పాటు బాధితులకు రుచికరమైన ఆహారం అందజేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రంలోని దాతలు పెద్ద ఎత్తున వరద సాయంను నేటికీ ప్రభుత్వానికి అందిస్తున్నారన్నారు. దాతలు ఇచ్చిన డబ్బు నిజమైన వరద బాధితులకు అందాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తిగా సర్వే పూర్తి చేసి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మహానాడు 25వ రోడ్డులో ఎవరికీ నష్టపరిహారం అందలేదని, బాధితులందరికీ న్యాయం చేయాలన్నారు. లేకుంటే రెండు రోజుల్లో కలెక్టర్‌ను కలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, కొట్టే కరుణాకర్, నాయకులు దొంతిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, వై.బర్నబాస్, ఐద్వా నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కె. ఉష, పి. గిరిజ, జ్యోతి, భ్రమరాంబ, శుభ, లక్ష్మి, వరద బాధితులు, మహిళలు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ దృష్టికి తీసుకెళ్తాం

సాక్షి ఎఫెక్ట్

తాడికొండ: టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి తాడికొండలో పంచాయతీ దుకాణాల తాళాలు పగలగొట్టిన వ్యవహారంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కోర్టు తీర్పును అడ్డుపెట్టుకొని పంచాయతీ పాలకవర్గం నిర్ణయం లేకుండా తాళాలు పగలగొట్టిన వ్యవహారంపై శుక్రవారం పాలకవర్గ సమావేశంలో చర్చ జరిగింది. డిపాజిట్‌ను సొంతానికి వాడుకొని పంచాయతీ దుకాణాలు కేటాయించడం ఏంటని, ఆ నగదు వ్యవహారం తేల్చమని పలువురు ప్రశ్నించారు. దీనిపై తాను డీఎల్‌పీవో దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటానని కార్యదర్శి హరిబాబు పాలక వర్గానికి తెలియజేశారు. అయితే గత ఏడేళ్లుగా పంచాయతీ నగదు ఖాతాలో జమ వేయకుండా జేబులో వేసుకున్న గత టీడీపీ హయాంలోని పాలకవర్గం ఇప్పుడు ఆ నగదు డిపాజిట్ చేస్తామని చెబుతుండటం విశేషం. కాగా అప్పటి నుంచి ఇప్పటి వరకు అప్పటి పాలకవర్గం చేసిన తప్పిదం కారణంగా దాదాపు 7 సంవత్సరాలకు పైగా 4 పంచాయతీ దుకాణాలు మూతపడి ఉన్న కారణంగా ఒక్కో దుకాణానికి నెలకు రూ.4 వేల చొప్పున రూ.16 వేలు అంటే ఏడేళ్ళలో దాదాపు రూ.15 లక్షల వరకు ఆదాయానికి గండి పడింది. దీనికి తోడు రూ.6 లక్షలు ఖాతాలో జమ చేయకుండా సొంతానికి వాడుకున్న నేపథ్యంలో ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ. 20 లక్షలకు పైగా చిల్లు పడింది. దీనిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయానికి పడిన గండిని పూడ్చేందుకు జరిమానాతో సహా కట్టించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు ఏం నిర్ణయం తీసుకుంటారో అనే దానిపై గ్రామస్తులు ఆశక్తిగా ఎదురు చూస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్‌కు చెందిన పెయింటర్ చావలి రాజేష్ (38) భార్య కొంత కాలం క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రమ్మన్నా రావడంలేదు. మనస్తాపానికి గురైన అతను గురువారం రాత్రి మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. కుటుంబసభ్యులు తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి తర్వాత మృతి చెందాడు. వైద్యశాల నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ నిస్సార్ బాషా తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథణం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ రామలింగేశ్వరపేట డిపో సెంటరుకు చెందిన నీలం సాయితేజను కబేళా వంతెన వద్ద ముత్తెంశెట్టిపాలెంకు చెందిన రామకృష్ణ మరో నలుగురు దాడి చేసి గాయపర్చారు. బాధితుడు శుక్రవారం రాత్రి పోలీసులకు ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన టౌన్ పోలీసులు తెలిపారు.

నేడు రోటరీ గవర్నర్ పర్యటన

తెనాలి: రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-3150 జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి శనివారం తెనాలిలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూలులో డైనింగ్ హాలు, సైకిల్ స్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అక్కడే దివ్యాంగులకు వీల్‌చైర్లు, గ్యాస్ ఐరన్ బాక్సులను పంపిణీ చేస్తారని రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సాయంత్రం ఆరు గంటలకు గౌతమ్ గ్రాండ్ హోటల్లో క్లబ్ అసెంబ్లీ, ఏడు గంటలకు బహిరంగసభలో పాల్గొంటారన్నారు. డిప్యూటీ, అసిస్టెంట్ గవర్నర్లు శివరంజని, పెరుమాళ్లు పాల్గొంటారని తెలిపారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

తెనాలి: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. యూటీఎఫ్ తెనాలి ప్రాంతీయశాఖల ఆధ్వర్యంలో స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓటు నమోదు నిమిత్తం వచ్చిన పట్టభద్రులకు నమోదు చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు టీఎస్ఎన్ఎల్ మల్లేశ్వరరావు, జిల్లా అర్థిక కార్యదర్శి గయాసుద్దొలా, జిల్లా కార్యదర్శులు సాంబశివరావు, కేదార్‌నాథ్, కామాక్షి, ప్రసన్నత్, సతీష్, నాగేంద్రబాబు, కోటిసుందరరావు, వ్యవసాయ కార్మిక సంఘ బాధ్యులు ములకా శివసాంబిరెడ్డి, కాలేషా తదితరులు పాల్గొన్నారు.